పరారీలోనే నిందితుడు రాగి వీరాచారి

చిక్కడపల్లి, అక్టోబర్ 5: ఓ వ్యక్తిపై తీవ్రంగా దాడి చేసిన కేసులో రాగి వీరచారిపై కేసు నమోదైందని, హై కోర్టు బెయిల్ నిరాకరించిందని గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని ప్రతిష్టాత్మక హెబ్రోను చర్చి ప్రతినిధులు ఏలీయా జయరాజు, జయప్రకాశ్, ఎంఎఫ్ క్రిస్టోఫర్, జేమ్స్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడారు. చర్చిలో ఆగస్టు 31న ఓ వ్యక్తిని బంధించి దాడి చేసిన ఘటలో బాదితుడి ఫిర్యాదు మేరకు వీరాచారిపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. కాగా ఆయనపై 34 కేసులు నమోదయ్యాయని, అతనికి బెయిల్ ఇవ్వొద్దని చేసిన విజ్ఞప్తి మేరకు హైకోర్టు నిరాకరించిందన్నారు. గత నెల రోజులుగా అజ్ఞాతంలోనే ఉంటున్నాడని, అతను ఇతర దేశాలకు పారిపోకుండా పాస్‌పోర్ట్‌ను ప్రభుత్వం జప్తు చేయాలని వారు కోరారు.

ప్రకృతి పండుగ బతుకమ్మ

- బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

బేగంపేట్, అక్టోబర్ 5: ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం నెక్లెస్ రోడ్డులోని బుద్ధభవన్ వద్ద కర్భలామైదానంలో ఈనెల 10న నిర్వహించే బతుకమ్మ పండుగ ఏర్పాట్లను వివిధ శాఖ అధికారులతో పర్యవేక్షించారు. వేలాది మంది మహిళలు పాల్గొననున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా బతుకమ్మ పూర్తి అయ్యే వరకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. లైట్లను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. హుస్సేన్ సాగర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో నిమజ్జనం వద్ద కూడా లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల సౌకర్యార్థం తాగునీటి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలన్నారు. తెలంగాణ ప్రాంతానికే పరిమితమైన బతుకమ్మ విదేశాల్లో కూడా నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం వినోద్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కర్భలామైదాన్ బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ తీసుకువస్తున్న ఆడపడుచు

జెక్‌కాలనీ వాసవి ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్స్ వద్ద మాధవి, వాణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు తరలివచ్చిన మహిళలు

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న అధికారి డాక్టర్ రజనీప్రియ, ఈశాన్య రాష్ట్రాల ఆడపడచులు, తదితరులు

చిక్కడపల్లి/అమీర్‌పేట్/బొల్లారం, అక్టోబర్ 5: చిక్కడపల్లి న్యూఎరా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల్లో కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఎస్.శ్రవణ్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో జహ్నవి గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడి సందడి చేశారు. చైర్మన్ ఎ.పరమేశ్వర్, వైస్ చైర్మన్ లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో పలువురు ఆడపడుచులు బతుకమ్మలు ఆడి పాడారు.

సుందరయ్య పార్కులో జహ్నవి కళాశాల ఆధ్వర్యంలో సంబురాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

చిక్కడపల్లిలోని న్యూ ఎరా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు

చిల్లిగవ్వను విదిల్చని సీఎం

ఇక్కడే సమావేశం పెట్టినా నిధులేవీ? - బీఆర్ఎస్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, అక్టోబర్ 5: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవం అంటూ ప్రజలకు కార్డులు ఇవ్వకుండా దరఖాస్తులను అందజేయడం ఏమిటని బీఆర్ఎస్ సీనియర్ నేత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శనివారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు అనిత, నళిని, లోక్‌నాథంతో కలిసి ఆయన మాట్లాడారు. మొదటిసారిగా సీఎం హోదాలో కంటోన్మెంట్‌లో అడుగుపెట్టిన రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారన్నారు. కానీ చిల్లిగవ్వ కూడా విదిల్చకుండా వెళ్లారని ఎద్దేవా చేశారు. డిజిటల్ కార్డులు ఇవ్వకుండా ఆప్లికేషన్ ఫామ్‌లను మాత్రమే పంపిణీ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎలివేటెడ్ కారిడార్‌ను తామే సాధించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకుంటున్నారని, కేసీఆర్ హయాంలోనే ఎస్ఎన్‌డీపీతో కంటోన్మెంట్‌లోని ఒకటి, రెండు ఆరు వార్డులు వరద ముంపునకు గురికాకుండా ప్యాట్నీ నాలాను అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో నిర్మాణం పూర్తి చేయడంతో ముంపు తప్పిందని గుర్తు చేశారు. ఆదేవిధంగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలను కేంద్రం తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిర్వహించకుంటే కోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని పలువురు ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి 29 వరకు ఆదిలాబాద్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు దాసర్ల శ్రీశైలం మాట్లాడుతూ తెలంగాణ కలసాకారం చేసుకునేందుకు సకల జనుల పాత్ర మరవలేనిదన్నారు. ఉద్యమంలో ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, అరెస్టులు, లాఠీచార్జీలు, దాడులు, జైలు జీవితాలు అన్ని ఎదిరించి, పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ బోయిళ్ల విద్యాసాగర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డాక్టర్ చొప్పరి శంకర్, శ్యామ్‌సుందర్, మాజీ కార్పొరేటర్ యాదయ్య, ఆలకుంట కుమార్, గోపాల్‌నాయక్, బొంత వెంకటయ్య పాల్గొన్నారు.

18 నుంచి బీ2బీ నగల ప్రదర్శన

అమీర్‌పేట్: ప్రత్యేక దీపావళి ఎడిషన్‌గా దక్షిణభారత అతిపెద్ద బీ2బీ నగల ప్రదర్శన హైదరాబాద్ ఇంటర్నేషనల్ జువెల్లరీ షో (హెచ్ఐజేఎస్) ఈనెల 18 నుంచి 20 వరకు హైటెక్స్‌లో జరుగనుంది. శనివారం అమీర్‌పేట్‌లోని హోటల్ మారీగోల్డ్‌లో సన్నాహక కార్యక్రమంలో భాగంగా నటీమణులు వర్షిణి సౌందర్‌రాజన్, స్రవంతి చొక్కారపులతో పాటు పలువురు మోడళ్లు ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. హైటెక్ సిటీ నగర తయారీ వర్తకుల సంఘం అధ్యక్షుడు మహేందర్‌తాయల్, ఉపాధ్యక్షుడు ముఖేశ్‌అగర్వాల్, తెలంగాణ బులియన్ అండ్ జువెల్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీశ్‌ప్రసాద్‌వర్మ, సురేశ్‌భోస్తే, యునైటెడ్ ఎగ్జిబిషన్ పీడీ వీకే మనోజ్ హెచ్ ఐజేఎస్ పోస్టర్ ఆవిష్కరించారు.

మానసిక దివ్యాంగులకు చేయూతనందించాలి

నృత్యాలు చేస్తున్న మానసిక వికలాంగులు

అడ్డగుట్ట, అక్టోబర్ 5: మానసిక వికలాంగులకు చేయూతనివ్వాలని తపష్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్య బట్టు అన్నారు. శనివారం మెట్టుగూడ విజయపురికాలనీలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తపష్ 'సొసైటీ ఫర్ ఏ స్మైల్' రెండో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బల్లయ్య బట్టు హాజరై ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో మానసిక దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని అలరించారు. కార్యక్రమంలో తపష్ అధ్యక్షులు భావన, ఉపాధ్యక్షుడు రాము, కోశాధికారి, అశోక్‌కుమార్, డైరెక్టర్ నాగేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా కాకా జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి (కాకా) జయంతిని ఓయూలో శనివారం నిర్వహించారు. ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ ఆశయ సాధనకోసం అనునిత్యం పోరాడిన పోరాట యోధుడు కాకా అని కొనియాడారు. విద్యా వ్యాప్తి కోసం అంబేద్కర్ పేరిట కళాశాల స్థాపించిన మహనీయుడని ప్రశంసించారు. పూలే, అంబేద్కర్, కాన్షీరాం ఆశయ సాధనకు కంకణబద్ధులై కదిలినపుడే కాకాకు మనమిచ్చే ఘననివాళి అని చెప్పారు. ఆయన నేటి రాజకీయ నాయకులు, యువతకు ఆదర్శమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమాన్ని ఢిల్లీ స్థాయిలో చాటిచెప్పిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. 1969 ఉద్యమంలో బుల్లెట్ గాయాలై జైలుకెళ్లారని గుర్తు చేశారు. బడుగు, బలహీనవర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వెంకటస్వామి పేరును పెద్దపల్లి జిల్లాకు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు లింగంగౌడ్, వలిగొండ నరసింహ, ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్, విజయ్‌నాయక్, వీరబోయిన లింగం యాదవ్, కరుణాకర్, రమేశ్, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు కాకా

చిక్కడపల్లి: అట్టడుగువర్గాలకు ఉన్నత విద్యను అందించడానికి మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ దివంగత నేత గడ్డం వెంకటస్వామి విద్యాసంస్థలు స్థాపించి వేలాది మందికి విద్యనందించిన మహనీయుడని వక్తలు కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కాకా జయంతిని శనివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి గడ్డం వినోద్, కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజవివేక్ కాకా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

దేవీ నామం.. మహిమాన్వితం



అమీర్‌పేట్: రాజరాజేశ్వరి దేవి అలంకరణలో ఎల్లమ్మ. గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



బొల్లారం: బోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు టింకుగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు చేశారు.

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు ఎమ్మెల్యే ముఠాగోపాల్.

బొల్లారం: తిరుమలగిరి సెంట్రల్ బస్తీ బస్తీలో ఎమ్మెల్యే శ్రీగణేశ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

సికింద్రాబాద్: మేడిబావిలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు

అమీర్‌పేట్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించిన దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, చిత్రంలో ఈవో బి.కృష్ణ

రాష్ట్రపతి నిలయంలో సాంస్కృతిక ప్రదర్శనలు

కళా మహోత్సవాలను సందర్శించిన ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు

ప్రదర్శనలో స్టాల్స్ వద్ద సందర్శకులు

బొల్లారం, అక్టోబర్ 5: ఈశాన్య భారత సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని, వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవం వైభవంగా జరుగుతున్నదని రాష్ట్రపతి నిలయం అధికారి డాక్టర్ రజనీప్రియ తెలిపారు. శనివారం ఆర్మీ, మీడియా, వివిధ వర్గాల కళాభిమానులు మహోత్సవాలకు తరలివచ్చారని ఆమె పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, అస్సోంకు చెందిన గాయకులు సంగీతం, పాటలతో సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఉత్సవాల్లో భాగంగా అష్టలక్ష్మి, రంగోలి, సాంస్కృతిక ప్రదర్శనలు, ఈశాన్య రాష్ట్రాల వంటకాలు ఆకట్టుకున్నాయి.

సాంస్కృతిక ప్రదర్శనలో అలరిస్తున్న ఈశాన్య రాష్ట్రాల యువతులు

తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అడ్డగుట్ట, అక్టోబర్ 5: నార్త్ లాలాగూడలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో గ్లోబర్ గోర్ జాబ్స్(జీజీజే) ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, ఇండస్ట్రీ ట్రెండ్స్‌పై గోర్ బంజార విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విశ్రాంత ఐపీఎస్ డీటీ నాయక్, రిటైర్డ్ ఐఆర్ఎస్ బాలనాయక్, లక్ష్మణ్‌నాయక్, బంజారా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌జాదవ్, ఐపీఎస్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొని కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాంకేతికతలో నూతన పోకడలను అందిపుచ్చుకోవాలని అన్నారు. స్కిల్స్ డెవలప్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. గ్లోబల్ గోర్ జాబ్స్ వంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో 500 మంది విద్యార్థులు హాజరై సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఓయూ అంతర్ కళాశాలల ఫెన్సింగ్ చాంప్ బాబిరెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి అక్టోబర్ 5 : ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను శనివారం ఓయూలో జరిగిన కార్యక్రమంలో వికారాబాద్ కేవీఎం కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థిని బాబిరెడ్డి సొంతం చేసుకుంది. ఎ.శిరీష, జి.శ్రీజ (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెంటల్ కళాశాల)లు రెండు ,మూడు స్థానాలను దక్కించుకున్నారు. విజేతలకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, నిర్వాహక కార్యదర్శి దీపాల బహుమతులు అందజేశారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి, అక్టోబర్ 5: బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మార్వో సంధ్యారాణితో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, వల్లాల శ్యామ్‌యాదవ్, ముచ్చకర్తి ప్రభాకర్, ముఠా నరేశ్, పున్న సత్యనారాయణ, కల్యాణ్, జనార్దన్, టీవీ రాజు, తదితరలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ బోయిళ్ల విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉద్యమకారులు సమావేశమయ్యారు. రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ బోయిళ్ల విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ విఠల్, ఉపాధ్యక్షుడిగా శెగ్గం శంకర్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ గోపాల్ నేనావత్, కోశాధికారిగా బండి రమేశ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డి. వెంకట్‌నారాయణ, డాక్టర్ మార్క్ పోలోనియస్ ఎంపి కయ్యారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బాబా ఫసియుద్దీన్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్ తెడ్డు, మెదక్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ప్రదీప్‌కుమార్ సేగూరి, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాజు గాదెపాక, ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా సంపత్, నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా సైదులు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నర్సింహగౌడ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఆశనారాయణ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బాలరాజ్ నాయక్ ఎన్నికయ్యారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

అమీర్‌పేట్, అక్టోబర్ 5: బేగంపేట్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల 44వ గ్రాడ్యుయేషన్ డే శనివారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, గౌరవ అతిథిగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాజోసెఫ్‌తో కలిసి ప్రారంభించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన 2021-24 (యూజీ బ్యాచ్), 2022-24 (పీజీ బ్యాచ్)లకు చెందిన 40 మంది బంగారు పతకాలను అందుకున్నారు. సాంఘిక శాస్త్రాల నుంచి వెంకట సాయితరుణి, సైన్సెస్ నుంచి బరాగమిన అత్యధికంగా బంగారు పతకాలు సాధించారు.

వర్గీకరణ తరువాతే ..

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: ఎస్సీ వర్గీకరణ అమలు తరువాతే డీఎస్సీ నియామక పత్రాలు ఇవ్వాలని మాదిగ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎంఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు బుషిపాక గణేశ్ డిమాండ్ చేశారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రెండు నెలలైనా వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మండిపడ్డారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌తో కలిసి గణేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తక్షణమే చేస్తామని సీఎం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని గుర్తుచేశారు. ఈనెల 9న చేపట్టే డీఎస్సీ నియమక ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో ప్రక్రియను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తాళ్ల అజయ్, గుమ్మడెళ్లి తిరుమలేశ్, కూరపాటి ఆంజనేయులు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డీజేలు అనుమతించాలి

సికింద్రాబాద్, అక్టోబర్ 5: నగరంలో డీజేలపై విధించిన నిషేధాన్ని బతుకమ్మ పండుగకు సడలింపు ఇవ్వాలని లక్ష్మీ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ నగర సీపీ సీవీ ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ విషయంలో పునరాలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బాలరాజ్‌యాదవ్, బాబురావు, శైలందర్, జగదీష్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలిరెడ్డి, సునీల్‌ముదిరాజ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.